అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు కంటి పరీక్షలు



చెప్పల్‌బజార్‌లోని కేంద్రంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: చెప్పల్‌బజార్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వ హాస్పిటల్ వైద్య సిబ్బంది పిల్లలకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని కార్పొరేటర్ ఉమారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒక నెల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు కంటి పరీక్షలు చేశారు. పిల్లలకు ఎప్పటికప్పుడు కంటి వైద్య పరీక్షలు చేయించాలని పిల్లల తల్లిదండ్రులకు కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ జనార్దన్, అలేఖ్య, సబిత, బీజేపీ నేతలు బి.భీమ్‌రాజ్, మల్లికార్జున్, ఆర్.సంతోష్, ఎస్.రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ సబ్ డివిజన్ ఏసీపీగా యాదగిరి



కవాడిగూడ: శాంతి భద్రతలు, నేరాల అదుపులో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించి శాంతి పరిరక్షణకు దోహదపడాలని గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ.యాదగిరి సూచించారు. సిద్దిపేట టౌన్‌లో సీసీఎస్‌లో ఏసీపీగా విధులు నిర్వర్తించిన యాదగిరి బదిలీపై వచ్చి గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీనగర్, దోమలగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, పాతనేరస్తులపై ఎప్పటికప్పుడు నిఘాపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కలుషిత నీటి సరఫరా నివారణకు చర్యలు



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ మోహన్ నగర్‌లో కలుషిత నీటి నివారణకు యుద్ధప్రాతిపాదినక చర్యలు తీసుకుంటాని ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానికులకు హామీ ఇచ్చారు. శుక్రవారం మోహన్‌నగర్‌కు చెందిన బస్తీ పెద్దలు గండి కృష్ణ, పూస గోరఖ్‌నాథ్, రాజు, సైదాభాను తదితరులు ఎమ్మెల్యేను కలిసి కలుషిత నీటి సరఫరాను నివారించాలని వినతిపత్రం అందజేశారు. 40 ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైపులైన్ల కారణంగా ఈ సమస్య తలెత్తుతోందని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ పైపులైన్లు తొలగించి కొత్త పైపులైన్లు వేసేందుకు చర్యలు తీసుకుంటాని పేర్కొన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఆదేశిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసులు జయలక్ష్మీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.6వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి



ఉపముఖ్యమంత్రికి బీసీ నేతలతో కలసి వినతి పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: ఇంజనీరింగ్, డిగ్రీ, ఉన్నత విద్య కాలేజీ కోర్సులు చదువుతున్న 14 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.6వేల కోట్లు వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను వినతి పత్రం అందజేశారు. కాలేజీ హాస్టళ్ల మూడేళ్ల అద్దె బకాయిలతో పాటు ఎస్సీ హాస్టళ్ల మెస్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నెల రోజుల్లో ఫీజుల బకాయిలు, హాస్టళ్ల అద్దె బకాయిలు చెల్లిస్తామని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం

నల్లకుంట: న్యూ నల్లకుంట ప్రభుత్వ హై స్కూల్‌లో 1976లో పదో తరగతి విద్యార్థులు శుక్రవారం స్థానికంగా ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆద్యంతం అలరించింది. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించిన ఈ కార్యక్రమంలో దశాబ్దాల క్రితం నాటి స్నేహ బృందాలు కలుసుకున్నాయి. ఆనందోత్సాహలతో సందడి చేసింది. పూర్వ విద్యార్థి శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపల్ పోపూరి శ్రీనివాసశర్మ తోటి పూర్వ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

ఐదేళ్లుగా ముందుకు సాగని ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ పనులు | ప్లాస్టిక్ స్క్రాప్, చెక్కలతో అధ్వానంగా హాల్ ఆవరణ | మేయర్ హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా పూర్తికాని వైనం



కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ (ఫైల్)



ఇందిరానగర్‌లో నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు



కమ్యూనిటీహాల్ ఆవరణలో కుప్పలుకుప్పలుగా స్క్రాప్

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు ఐదేళ్లయినా పూర్తి కావడం లేదు. నగర మేయర్ కమ్యూనిటీహాల్‌ను సందర్శించి వెంటనే నిధులు విడుదల చేసి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా ముందుకు సాగని నిర్మాణ పనులు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఇందిరానగర్ వాసులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.. అనే చందంగా మారింది.

2020లో శంకుస్థాపన...

ఇందిరానగర్ ఫస్ట్ వెంచర్‌లో 2020 ఫిబ్రవరి 15న 200 గజాల స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.19.10 లక్షలు మంజూరు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దివంగత మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు హాజరై శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు కేవలం స్లాబ్, గోడలకే పరిమితమయ్యాయి.

ఒక్క అడుగు కూడా ముందుకు సాగని పనులు..

స్థానికుల ఫిర్యాదు మేరకు నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి జనవరి 9న ఇందిరానగర్ కమ్యూనిటీహాల్‌ను ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్‌తో కలిసి సందర్శించారు. కమ్యూనిటీహాల్ పరిస్థితిని చూసి నిధులు వెంటనే విడుదల నిర్మాణం పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అయినా నిర్మాణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్క్రాప్‌కు నిలయంగా మారిన వైనం...

ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో స్థానిక వ్యాపారులు కమ్యూనిటీహాల్ ఆవరణలో ప్లాస్టిక్ స్క్రాప్, ప్లైవుడ్ చెక్కలను నిల్వ చేస్తున్నారు. కొందరైతే పార్కింగ్ స్థలంగా వాడుకుంటున్నారు. దీనితో కమ్యూనిటీహాల్ ఆవరణ అపరిశుభ్రంగా మారింది. స్క్రాప్‌ను తొలగించాలని వ్యాపారులను విన్నవిస్తే గొడవలకు దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం...



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశాం. నగర మేయర్‌కు సైతం ఫిర్యాదు చేశాం. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని కోరాం. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– నందగిరి నర్సింహ, బస్తీ నాయకుడు

పూర్తి చేసేందుకు కృషి...



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. స్థానికులు సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తయ్యేలా నిధులు విడుదలయ్యే కృషి చేస్తాం.

– ముఠా గోపాల్, ముషీరాబాద్ ఎమ్మెల్యే

25న కంటి ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ వాసులకు కంటి పరీక్షలు, శస్త్ర చికిత్స శిబిరాన్ని ఈనెల 25న హబ్సిగూడ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తున్నట్లు యోగక్షేమం వహామ్యహం చారిటీ ట్రస్ట్ సంస్థ వ్యవస్థాపకులు వారణాసి కృష్ణమూర్తి తెలిపారు. గురువారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి మరుసటి రోజు లిబర్టీలోని సాధూరామ్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ గురుకులాలను మూసేయొద్దు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ గురుకులాల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 గురుకులాల జూనియర్ కళాశాలలను మూసేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అత్యంత బాధాకరమని అన్నారు. విద్యార్థులు లేరనే సాకుతో మూసేయటం పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడమేనని పేర్కొన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ జాప్యంతోనే గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరలేకపోతున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రవేశాల విధానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం అప్పుల్లో ఉందని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారని కోతల్లో భాగంగానే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు.

డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



కవాడిగూడలో మంచినీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేటర్లకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర ఖజానాకు నగరం నుంచి 70శాతం పన్నుల రూపంలో ఆదాయం వస్తోందని అన్నారు. అందుకే ఆయా నియోజకవర్గాలు, డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. వైస్రాయ్ హోటల్ చౌరస్తా నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ గోశాల వరకు రూ.23.40లక్షలతో తాగునీటి పైప్‌లైన్ చేపట్టనున్నారు. ఈ పనులను శుక్రవారం కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నగర కార్పొరేటర్లకు నిధులు కేటాయించకుండా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం నగరంలో కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేలు లేరని ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వంలా చేయొద్దన్నారు. రాజకీయాలకు అతీతంగా డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి. రవీందర్, భరత్‌గౌడ్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, ఎం.రమేష్‌రాం, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, కవాడిగూడ మేనేజర్ శ్రీధర్, గాంధీనగర్ సీఐ ఎస్.బోస్‌కిరణ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేరళ తరహాలో నీరా బోర్డు ఏర్పాటు చేయాలి



బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రభుత్వం గీత కార్పొరేషన్ ద్వారానే నీరా కేఫ్‌ను నిర్వహించి నిరుపేద గీత కార్మికులకు ఉపాధి కల్పించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు అంబల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గీత కార్పొరేషన్ ద్వారా వచ్చిన ఆదాయంతో గీతన్నల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. పాడి పరిశ్రమ మాదిరిగా నీరా పరిశ్రమను అభివృద్ధి చేసే విధంగా సమగ్ర విధానాన్ని రూపొందించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం గౌడ కల్లుగీత సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. నీరా కేఫ్ టెండర్లను పిలిచే ముందు గౌడ సంఘాలతో సంప్రదించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. నిజమైన వృత్తి దారులకు న్యాయం జరగాలంటే గీత కార్పొరేషన్ ద్వారానే నీరా కేఫ్‌ను నిర్వహించాలన్నారు. కేరళ రాష్ట్రం తరహాలో నీరా బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.


ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడదాం



అరుణోదయ రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముషీరాబాద్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక సభ్యులు, విప్లవోద్యమ సంస్కృతిక సేనాని కామ్రేడ్ అరుణోదయ రామారావు వర్ధంతిని మార్క్స్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోవర్ధన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అరుణోదయ రామారావు తన జీవితం చివరి శ్వాస వరకు ప్రజల కోసం పని చేశారన్నారు. విప్లవోద్యమ సంస్కృతిక ఉద్యమంలో ఎనలేని కృషి చేశారన్నారు. తెలుగు నేల మీద అరుణోదయ రామారావు పాట ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆయన అమరుడైనా మన రామ నరసయ్య అని రామారావు గొంతు ఎత్తితే గ్రామాలకు గ్రామాలు కదిలి వచ్చి వీక్షించే వారన్నారు. అలాంటి మహనీయుడి ఆశయాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి జి.ఝాన్సీ, అనురాధా, అనసూయ, శ్రీనివాస్, నాగరాజు, నవీన్, శ్రీనివాస్, ఆసిఫ్, గౌతమ్, ఝాన్సీ, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్‌తో సమావేశమైన సెంట్రల్ పీస్ కమిటీ సభ్యులు

కాచిగూడ: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాచిగూడ ఏసీపీ వై.హరీష్‌కుమార్ పేర్కొన్నారు. వచ్చే బోనాలు, బక్రీద్ పండుగలను దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శుక్రవారం కాచిగూడ ఏసీపీతో సమావేశమయ్యారు. ఏసీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ హరీష్‌కుమార్ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు పీస్ కమిటీ ప్రతినిధులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మీర్ యూసుఫ్ హమీద్, సయ్యద్ ఫరీదుద్దీన్ యూనస్, లక్ష్మన్, వెంకట్, ఇర్షాద్ నవాబ్, షహీన్ బాయి, సురేందర్ సింగ్, సిద్దిఖ్, విజయ్ రాతి, శ్రీలత, హరినివాస్ ఆటల్, శ్రీనివాస్‌గౌడ్ సత్యనారాయణ, సయ్యద్ అబ్దుల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



బుర్ర కృష్ణ (ఫైల్)

కవాడిగూడ: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని అపస్మారకస్థితికి చేరుకోగా అతడి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమా మైదాన్ వాంబేకాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వాంబేకాలనీలో నివాసం ఉండే బుర్ర కృష్ణ (39), వనిత భార్యభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుర్ర కృష్ణ వృత్తిరీత్యా కూలి. కుటుంబ కలహాల కారణంగా గురువారం సాయంత్రం 5.30గంటలకు ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టి అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడు అక్క నోమాల వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం అతడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడకు చెందిన అభిషేక్ (29) శుక్రవారం యాకుత్‌పుర–ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అజమాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వర రావు తెలిపారు. విద్యానగర్, బీబీడీ, చిక్కడపల్లి ఫీడర్ల పరిధిలోని రాంనగర్ గుండు, అడిక్‌మెట్, విద్యానగర్, కాచిగూడ రైల్వే స్టేషన్, ఫీవర్ హాస్పిటల్, బర్కత్‌పూర డిపో, బీజేపీ కార్యాలయం, కాచిగూడ జూనియర్ కళాశాల, నారాయణగూడ, చిక్కడపల్లి, వెంకటేశ్వర స్వామి దేవాలయం, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు.... ఆర్టీసీ క్రాస్‌రోడ్, అహోబెల్‌మార్ట్ ఫీడర్ల పరిధిలోని ఇండస్ట్రియల్, రిసాలా, అంబేడ్కర్, అచ్చయ్యనగర్, బతుకమ్మ కుంట, డీటీఆర్, ఏటీఐ, సాయిబాబా టెంపుల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మళ్లీ ఉగ్రదాడికి పాల్పడితే
ప్రపంచ పటంలో పాకిస్తాన్ ఉండదు





తిరంగా యాత్రలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

నల్లకుంట: భారత్‌లో మరోసారి పాకిస్తాన్ ఉగ్రదాడులకు పాల్పడితే ప్రపంచ పటంలో లేకుండా చేసే శక్తి భారత సైన్యానికి ఉందని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నల్లకుంట నుంచి బర్కత్‌పుర చమాన్ వరకు తిరంగా యాత్ర నిర్వహించారు. సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా 'మనం సైతం.. దేశం కోసం.. సైనికులకు వందనం'అనే నినాదంతో ఈ తిరంగా యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బర్కత్‌పుర చమాన్ వద్ద కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఆపరేషన సిందూర్‌లో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందని కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతున్నారని అన్నారు. ఇది పాకిస్తాన్ పాలకులకు, మీడియాకు అనుకూలమైందని పేర్కొన్నారు. ఈ పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

- ఒక్క విమానం కూడా కూలిపోలేదనే విషయం కాంగ్రెస్ నాయకులకు తెలుసన్నారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత పాకిస్తాన్ ప్రజలు అక్కడి పాలకులు, సైనికులపై తిరుగుబాటు చేస్తున్నారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల విజయం తర్వాత ప్రధాని మోదీ సారథ్యంలో నయా భారత్ నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. పాకిస్తాన్ నేడు చిప్పపట్టుకుని భిక్షం అడుక్కునే స్థితికి దిగజారిందన్నారు.
- భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ ద్వారా 9 ఉగ్రవాదుల స్థావరాలను 23 నిమిషాల్లో ధ్వంసం చేశారని తెలిపారు. ఈ దాడిలో వంద మంది ఉగ్రవాదులు హతమయ్యారని పేర్కొన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు సైనికులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, యాకర అమృత, నాయకులు రమేష్ యాదవ్, వనం రమేష్, ఎక్కాల నందు, ఎక్కాల కన్నా, ఎంబీ కిషోర్ కుమార్, కె. లక్ష్మణ్ కుమార్. కేజే బాబు, వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన సమస్యల పరిష్కారానికి చర్యలు



కవాడిగూడ ఎల్‌బీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: డివిజన్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రినగర్‌లో నెలకొన్న మంచినీటి, విద్యుత్, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఎల్‌బీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరడంతో శుక్రవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ బస్తీని సందర్శించి బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. డబుల్ బెడ్‌రూం పథకం కింద మొత్తం 40 ఇళ్లను నిర్మించారని.. అందులో 37 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. మిగతా మూడు ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టారన్నారు. ఇళ్ల కేటాయింపు సమయంలో లిస్టులో తమ పేర్లు ఉన్నప్పటికీ తమకు ఇళ్లు రాలేదని వాపోయారు. ఆ ఇళ్లు తమకు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. మూడు ఇళ్ల సమస్యను జిల్లాకలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. ఎల్‌బీనగర్ కనీస సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠాజైసింహ, డి.వాసు, జె.గణేష ఎస్.లలిత, డి.శంకర్, ఎస్.రాము, డి.కమల, ఎస్.పావని, పల్లాల శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మద్దతున్న నాయకులకే పదవులు

- ఖైరాతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి
- అంబర్‌పేట నియోజకవర్గ పార్టీ విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఖైరాతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు. శుక్రవారం బతుకమ్మకుంటలోని ఓ హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం విస్తత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతారావు, పార్టీ పరిశీలకులు వినోద్‌కుమార్, సౌజన్యలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పనితీరును వివరించాలన్నారు. రోబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజల్లో ఉన్న నాయకులకే పార్టీ గుర్తించి పదవులు ఇస్తుందని స్పష్టం చేశారు.

- నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులతో పాటు వారి సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకుని పార్టీ బాధ్యతలను అప్పగిస్తుందని తెలిపారు. ప్రజలతో సంబంధాలు లేని నాయకులకు పార్టీ బాధ్యతలు ఇవ్వడం కుదరదన్నారు. గతంలో మాదిరిగా సిఫార్సులతో పార్టీ పదవులు ఇప్పుడు వచ్చే పరిస్థితి లేదన్నారు. పార్టీకి విధేయంగా ఉంటూ ప్రజల్లో ఉండే వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్, మోతే రోహిత్, లక్‌పతి యాదగిరిగౌడ్, దిడ్డి రాంబాబు, పులిజగన్, రమేష్, హరినాథ్‌రెడ్డి, శంభుల శ్రీకాంత్‌గౌడ్, తోలుపునూరి కృష్ణగౌడ్, కోటం అనిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.